# Bhaktraj-Dhruv

(Telugu)

# భక్త ధ్రువ

శ్లో. ప్రియవ్రతోత్తానపాదే శతరూపాపతేఃసుతే
వాసుదేవస్య కలయా రక్షాయాం జగతః స్థితౌ
జాయే ఉత్తానపాదస్య సునీతిః సురుచిస్తయోః
సురుచిః ప్రేయసీ పత్యుర్నేతరాయత్సుతో ధ్రువః

ప్రవాహశీలమైనది ప్రపంచం. ఈ విశాలవిశ్వంలో గుణావగుణాలు రెండూ వెలుగునీడలవలె వెన్నంటియే ఉంటాయి. అహంకార బుద్ధితో జీవుడు కర్మలను అనుభవిస్తున్నా గుణదోషాలురెండూ వాని దేహాన్ని అంటిపెట్టుకొనియే ఉంటాయి. తమోగుణాధిక్యత విశేషంగా ఉంటే అసురయోని లభిస్తుంది. ఈ రెండూ సామాన్యస్థితిలో ఉన్ననాడు మనుష్యయోని లభిస్తుంది. మనం పెద్దలనుకున్న వారిలో కూడా కొన్ని దోషాలుంటాయి. కాని వారి మహత్త్వంవల్ల అవి నిగూఢంగా వుండిపోతాయేగాని బహిర్గతంకావు. నిజదోషాలను గుర్తించగలిగి వాటిని రూపుమాపుకోగల సామర్థ్యం కలిగివుండటమే మానవునిలోని విశేషము.

సృష్టికర్త అయిన చతుర్ముఖబ్రహ్మ కుమారుడు స్వాయంభువమనువు. సర్వసద్గుణవంతుడు. ధర్మాత్ముడూ అయిన ఈతని భార్య శతరూప, కల్యాణ స్వరూపిణి, సుశోభితాంగి. శతరూపామనువులకు ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడను ఇరువురు పుత్రులు కలిగారు. ఆ సుందరతేజోమూర్తులు వాసుదేవ కళాంశసంభూతులు. వారు సకాలంలో సర్వలక్షణ లక్షితోపేతులై లోకరక్షణ భారాన్ని వహించి భూమండలాన్ని పాలించసాగారు. అందులో ద్వితీయుడైన ఉత్తానపాద చక్రవర్తికి సునీతి, సురుచి అని ఇద్దరు భార్యలు. పెద్దభార్యసునీతి చిన్నభార్య సురుచి. సునీతి అందగత్తెకాదు. కాని మృదుస్వభావురాలు, మధుర భాషిణి, సదసద్వివేకవంతురాలు. భగవచ్చరణ కమలాలపైన విశేషానురాగం కలది. సంసారం సారహీనమని, సర్వేశ్వరుడు మాత్రమే సారస్వరూపుడని నమ్మి ఆ సాధ్వి సంచరించేది.

చక్రవర్తి ప్రేమానురాగాలనూ, మన్ననలనూ, విశేషంగా చూరగొన్న సురుచి సౌందర్యరాశి అయినప్పటికీ కర్కశస్వభావంతో పరుషవచనాలు పలుకుతూ ఉంటుంది.

మానవుని దృష్టి బాహ్యావిషయాలనే ఆకర్షిస్తూ ఉంటుంది. అసంఖ్యాకులు వశమయ్యేది బాహ్యాసౌందర్యానికే. అంతర్గతగుణాలను ఆదరించే వాళ్ళు వ్రేళ్ళమీదకే లెక్కకువస్తారు. ఉత్తానపాద చక్రవర్తి చిత్తం కూడా సురుచియొక్క బాహ్యాసౌందర్యమునందే లగ్నంకాసాగింది. ఆమెనే అతడు విశేషంగా ప్రేమిస్తున్నాడు. నియమానుసారం సునీతియే పట్టపురాణి కావలసివున్నా ఆమె భర్త ప్రేమకు పాత్రురాలు కాలేకపోయింది.

కాలంగడుస్తున్నది. ఉత్తానపాదునికి సునీతివల్ల ధ్రువుడు. సురుచివల్ల ఉత్తముడు జన్మించారు.

ఒకనాడు చక్రవర్తి సురుచినందనుడైన ఉత్తముణ్ణి తన తొడపై కూర్చోనబెట్టుకొని ఉండగా, కుమారధ్రువుడు అక్కడకువచ్చి తాను కూడా తండ్రి రెండవతొడమీద కూర్చోవాలని ప్రయత్నంచేస్తుండగా, అదే సమయానికి అక్కడకు వచ్చిన సురుచి ధ్రువుని నిరోధిస్తూ, "ధ్రువా! రాజసింహాసనాన్ని అధిష్ఠించడానికి నీకు అధికారంలేదు. నువ్వు రాజకుమారుడివే అయినా నా గర్భంనుండి ఆవిర్భవించకపోవడంవల్ల నీకీ అవకాశంపోయింది. నీవు మరో స్త్రీవల్ల జన్మించావుగనక నీకా అదృష్టం తప్పిపోయింది. నీకి రాజసింహాసనాన్ని అధిష్ఠించాలన్న కోరికే ఉంటే నారాయణ భగవదనుగ్రహాన్ని సంపాదించు. తపస్సు ద్వారా ఆ దేవదేవుని అనుగ్రహాన్ని అయినా పొందాలి లేదా నాగర్భంనుండి అయినా జన్మించాలి. కనుక భగవదనుగ్రహాన్ని పొంది నా పుత్రుడవుగా జన్మించు. అప్పుడు నీకీ అధికారం కలుగుతుంది అందామె.

సవతితల్లి మాటలతో గాయపడ్డ ధ్రువుడు దెబ్బతిన్న త్రాచుపాము బుసలు కొట్టేటట్లు వేడి నిట్టూర్పులు విడువసాగాడు. చక్రవర్తి అంతా చూస్తున్నాడే కాని ఒక్కమాటైనా పలకలేదు. ధ్రువుని ఓదార్చలేదు. ఈ స్థితిని

చూసి ధ్రువుడు సహించలేక వెక్కివెక్కి ఏడుస్తూ వెంటనే తల్లిదగ్గరకు వెళ్ళిపోయాడు. బిడ్డను ఆ స్థితిలో చూసిన సునీతి మాతృహృదయం ద్రవించింది. ఆమె కుమారుని ఒడిలోకి తీసుకొని హృదయానికి హత్తుకుంది. ధ్రువునిద్వారా జరిగినసంగతి తెలుసుకుంది సునీతి. తన సవతి ప్రవర్తన ఆమెకు చాలా దుఃఖంకలిగించింది. ధైర్యాన్ని కోలుపోయింది. సవతిపలుకులు తలచుకుంటుంటే ఆమెకనులనుండి అశ్రుధారలు ప్రవహిస్తున్నాయి. ఆమె దుఃఖానికి అంతులేదు. ఆమె దీర్ఘంగా నిట్టూరుస్తూ- "నాయనా! పరులను గురించి ఎన్నడూ నీవు చెడుగా తలపోయకు. పరులకు దుఃఖాలు కలగాలని కోరేవాడు తానే దుఃఖాలపాలవుతాడు. సురుచి చెప్పినదంతా నిజమే. మహారాజుకు నేను భార్యగా ఉండడానికే కాదు, దాసిగా ఉండడానిక్కూడా తగను. అలా భావించడానికే నాకు సిగ్గుకలుగుతున్నది. కుమారా! దురదృష్టవంతురాలనైన నాగర్భాన ఏల జన్మించితివి? సవతితల్లి అయినా సురుచి సత్యమే పల్కింది. ఉత్తమునితో సమంగా నీవు రాజసింహాసనాన్ని అధిష్ఠించాలనుకుంటే అసూయా రహితుడవై నీ సవతి తల్లి ఉపదేశానుసారం శ్రీమన్నారాయణుని సేవించు. సత్త్వగుణ ప్రధానుడు, సర్వజగన్నియామకుడు అయిన శ్రీహరి కరుణవల్లనే నీ ముత్తాత బ్రహ్మదేవుడు సర్వశ్రేష్ఠమైన సత్యలోకాన్ని పొందగలిగాడు. ఆ శ్రీహరి విశేషానుగ్రహం వల్లనే మీ తాతగారైన స్వాయంభువమనువు, యాగాలు అనేకముగాచేసి అన్యజనదుర్లభమైన ఐహికపారలౌకిక సుఖపరంపరలు అనుభవించి మోక్షాన్ని పొందగలిగారు. కనుక పుత్రా! నీవుకూడా కరుణాసముద్రుడైన శ్రీమన్నారాయణునే ఆశ్రయించు. జననమరణరూప సంసారబంధంనుండి ముక్తిని పొందడానికై ముముక్షువు లందరూ ఆ దేవదేవుని దివ్యచరణకమలాలనే ఆశ్రయిస్తూంటారు. అనన్యాయత్తచిత్తంతో నీవుకూడా శ్రీహరినే ధ్యానించు. సర్వశక్తి సంపన్నుడైన ఆశ్రీహరివినా మన కష్టాలను దూరం చేయగలవారులేరు. ఏ దేవదేవుని ప్రసన్నత కోసం బ్రహ్మేంద్రాదులు నిర్విరామప్రయత్నాలు కొనసాగిస్తూ ఉంటారో, ఏ స్వామి అనుగ్రహాన్ని పొందడానికి పద్మపాణి ఆదిలక్ష్మీదేవి సర్వవేళల్లోనూ సావధానయై ఉంటుందో, ఆ పరమధామమునే ఆశ్రయించు" అని కన్నీటితో పల్కింది సునీతి.

ఉపదేశాత్మకంగా, శుభకరంగా ఉన్న తల్లిమాటలు ధ్రువుని మనసులో గాఢంగా నాటుకుపోయాయి. తన కోరిక నెరవేరాలంటే తాను శ్రీహరి కరుణకు పాత్రుడు కావాలి. తపస్సు ద్వారా ఆ దేవదేవుని దివ్యానుగ్రహాన్ని పొందాలన్న బలీయమైన వాంఛతో అతడు రాజమందిరమును రాజధానిని విడనాడి అరణ్యమార్గాన నడుస్తున్నాడు. ఈ సమాచారాన్ని తెలుసుకున్న దేవర్షి నారదుడు ధ్రువుని దగ్గరకొచ్చి అతని తలపై తన హస్తమునుంచి మనసులో, "క్షత్రియతేజం ఎంత అద్భుతమైనది? అల్పమైన అవమానాన్ని కూడా వారు సహించలేరుకదా! ఈ చిరుతప్రాయపు పిల్లవాడు తల్లిపలుకులకు తాళలేక నిర్జనారణ్యానికి వచ్చాడే!" అనుకుంటూ ఆశ్చర్యచకితుడై ఒక్షణం అలానే నిలిచి, ధ్రువుని సంబోధిస్తూ "నాయనా! నీవు చాలాచిన్నవాడవు, ఆటపాటలతో ఆనందంగా కాలంగడపాల్సినవాడివి. అట్టి నీకీ మానావమానాలతో సంబంధం లేదే, అలాకాక మానావమానాలు ఉన్నాయంటావా! అలాంటి భావం మోహాన్ని కలిగిస్తుంది. స్వకర్మఫలితంగానే మానవుడు ఈ జగత్తులో సుఖదుఃఖాలను, మానావమానాలను పొందుతూ ఉంటాడు. బాలకా! దైవలీలలు అత్యంత విచిత్రాలు. అందుకే ధీశాలురు విధివిధానాన్ని చక్కగా విచారణచేసి దైవికంగా ఏర్పడిన పరిస్థితులకు ఆనందంగా ఉండడానికే ప్రయత్నించాలి. కోరకపోయినా దుఃఖాలు కలిగేటట్లు సుఖాలుకూడా కలుగుతాయి. ఈ రెంటినీ సమానంగా చూడగలవాడు ఉత్తముడనబడతాడు. నీవిప్పుడు నీ మాతృమూర్తి ఉపదేశానుసారం యోగమార్గంద్వారా శ్రీహరిని ప్రసన్నుణ్ణి చేసుకోవాలని ఇలా వచ్చావు. కాని యోచించగా సామాన్యులు ఆ దేవదేవుని అనుగ్రహాన్ని పొందడం సాధ్యంకాని విషయం. సర్వసంగ పరిత్యాగులైన పరమయోగులు అనేక జన్మలనుండి శ్రీమన్నారాయణ పాదారవిందాలయందే చిత్తమును లగ్నంచేసి, అత్యంత కఠిన నియమాలను ఆచరిస్తూ, తపస్సు చేసి కూడా ఆ పరాత్పరుని పొందలేకపోతున్నారు. కనుక నీవు నీ పట్టుదలను, ఈ వ్యర్థప్రయత్నాన్ని విడిచిపెట్టి ఇంటికివెళ్ళు. పెద్ద వాడవైన పిదప పరమార్థప్రయత్నం చేయ వచ్చును. దైవయోగంవల్ల కలిగే సుఖదుఃఖాలను సమంగా భావించి ఆనందించగలవాడు నిత్యసంతోషి అవుతాడు. అట్టివాడే సంసార సాగరాన్ని దాటగలుగుతాడు. మనుష్యమాత్రుడు తనకన్న మిన్న అయిన సద్గుణాలు కలవాణ్ణి చూసి

ఆనందించాలి", గుణహీనుణ్ణి చూసి దయచూపాలి. తనతో సమాన గుణాలు కలవాణ్ణి చూసి స్నేహం కలిగి వ్యవహరించాలి. అలా చరించగలవానికెన్నడూ దుఃఖాలు సంభవించవని దేవర్షి పలుకగా విన్న ధ్రువుడు వినయం ఉట్టిపడేటట్లుగా ఆయనతో,

"స్వామీ! సుఖదుఃఖాలవల్ల చంచలమైపోయే చిత్తంగలవానికి కరుణాసాగరులైన తమ ఉపదేశం శాంతిని ప్రసాదిస్తుంది. కాని, నావంటి అజ్ఞానులకు అపరిపక్వ హృదయులైన బాలురకు ఆ స్థాయిని పొందే జ్ఞానం ఉండదుకదా! పైగా నాది క్షత్రియ స్వభావము. తత్కారణముగా నాయందు వినయభావం సహజసిద్ధంగా ఉంటుంది. నా సవతి తల్లి తన మాటలతో నా హృదయాన్ని బాధించింది. గాయపడిన నా హృదయంలో మీ ఉపదేశం నిలబడడంలేదు. ఈ మూడు లోకములలో అత్యున్నతమైనదీ, నాపితృపితామహాదులెవ్వరూ అధిష్ఠించలేనిదైన మహోత్తమస్థితిని పొందాలని నేను అభిలషిస్తున్నాను. మీరు బ్రహ్మమానసపుత్రులు. విశ్వకల్యాణ వాంఛతో వీణాపాణులై శ్రీహరి గుణగానం చేసుకుంటూ భాస్కరదేవసదృశంగా జగత్త్రయంలో సంచరిస్తూంటారు. మీకు తెలియనిదిలేదు. కనుక ఉత్తమపదాన్ని పొందే మార్గాన్ని నాకు సూక్ష్మంగా ఉపదేశించగోరుతున్నాను" అని అర్థించగా కరుణామయుడైన దేవర్షి ధ్రువునికి ఈ విధంగా ఉపదేశిస్తున్నాడు.

"వత్సా! నీకు నీతల్లి ఉపదేశించిన మార్గమే శుభప్రదమైనది. శ్రీమన్నారాయణుని విశేషానుగ్రహంవల్లనే ఉత్తమోన్నతపదవి లభిస్తుంది. వాసుదేవాయత్తమయిన చిత్తంతో నువ్వు తపస్సుచెయ్యి. చతుర్విధ పురుషార్థాలయందు ఆసక్తి కలవారు శ్రీహరినే భజించాలి. నీవిప్పుడు యమునాతీరానగల మధువనానికి వెళ్ళు. పరమపావనమైన ఆ వనం శ్రీహరికి నిత్యనివాసమై విరాజిల్లుతుంది. అక్కడ కాళిందీ జలాలలో నిత్యం మూడు వేళల్లోనూ స్నానంచేస్తూ నిత్యకర్మలు సక్రమంగా ఆచరిస్తూ స్థిరాసనంపై కూర్చుని శ్రీహరియందు చిత్తాన్ని లగ్నంచేసి సాధనద్వారా క్రమక్రమంగా మనఃప్రాణేంద్రియాలలో ఉండే దోషాలను పోగొట్టుకుంటూ ధైర్యంగా పరమగురువైన పరాత్పరుని ఈ రీతిగా ధ్యానించాలి.

నూవుపూవును పోలిననాసిక, ధనుస్సువంటి కనుబొమలు, సుందరమైన కపోలభాగము కలిగి దేవాదిదేవతలందరికంటే సౌందర్యవంతుడు, మనోహరమైన అంగప్రత్యంగాలు కలవాడు, దొండపండువంటి పెదాలు, అరుణారుణనేత్రాలు కలిగి ప్రణమిల్లువారి అభీష్టాలను నెరవేర్చువాడు, అపారసౌఖ్యాలను ప్రసాదించునట్టివాడు, దయాసాగరుడు అయిన శ్రీహరిని ధ్యానించాలి.

శరణాగతవత్సలుడైన శ్రీహరి, వక్షఃస్థలంలో శ్రీమహాలక్ష్మీదేవి ప్రకాశిస్తూ ఉంటుంది. శ్రీవత్సలాంఛనం నవ్యశోభతో అలరారుతూ ఉంటుంది. తొలకరి మేఘంలాంటి నీలవర్ణదేహంతో, గళసీమలో కౌస్తుభమణిని, పీతాంబరాన్ని ధరించి, నిత్యనూతన శోభతో శ్రీహరి ప్రకాశిస్తూ వుంటాడు. కటిసీమలో బంగారుమొలత్రాడు, శ్రీచరణాలలో స్వర్ణమయనూపురాలనూ కలిగిన భగవంతుని స్వరూపం మనోహరమై దర్శనీయమై శాంతిప్రదమై ఉంటుంది. మనోనేత్రాదులకు పరమానందాన్ని కలిగించేటట్లుగా ఆ దివ్య మంగళవిగ్రహం విరాజిల్లుతూ వుంటుంది. శ్రీహరిని మానసికంగా పూజించేవారు తమ హృదయంలో భగవంతుణ్ణి ధ్యానిస్తూ క్రమంగా ఆ దివ్యమంగళ రూపాన్ని మనసారా ధారణ చెయ్యాలి. అప్పుడే మందస్మిత వదనారవిందుడైన శ్రీహరి దర్శనమవుతుంది.

రాకుమారా! ఈ ధ్యానంతో కూడా పరమరహస్యమంత్రాన్ని ఉపదేశిస్తాను. దానినికూడా నువ్వు జపించాలి. సప్తరాత్రులకాలం ఈ మంత్రాన్ని జపించేవారు ఆకాశసంచారులైన సిద్ధులను చూడగలుగుతారు. "ఓం నమో భగవతే వాసుదేవాయ నమః" అనే ఈ మంత్రాన్ని జపించి దేశకాలానుసారం ఆయా ద్రవ్యాలతో పూజించి, హోమంచేసేవాడు సర్వమనోరథాలను పొందుతాడు. నిర్మలజలాలు, పూలమాలలు, కందమూల ఫలాలు, ధూర్వాంకురాలు, అరణ్యంలో లభించే నారచీరలు, తులస్యాదులచేత శ్రీహరిని ఆరాధించాలి. శిల లేక లోహమూర్తులు లభిస్తేమంచిది. లేకుంటే భూమి లేక జలాల్లోనే నారాయణదేవుని ఆరాధించాలి. సంయమనంతో, శాంతస్వభావంతో, మౌనందాల్చి,

అరణ్యంలో లభించే కందమూలాలను మితంగా భుజిస్తూ ఉండాలి. అంతేకాక పుణ్యకీర్తనుడైన శ్రీహరి అనిర్వచనీయమైన తన మాయాప్రభావంవల్ల ఇచ్ఛానుసారం అనేకావతారాలు ధరించి నటించిన లీలలను స్మరిస్తుండాలి. శ్రీహరి కథలను నిరంతరం స్మరిస్తుండాలి త్రికరణశుద్ధిగా తనను ఆరాధించునట్టి వారి భక్తిభావాన్ని పరమాత్మ వర్ధిల్లచేస్తుంటాడు. అంతేకాక భక్తునికి ఇచ్ఛానుకూలమైన ధర్మార్థకామమోక్షాలను కూడ ప్రసాదిస్తాడు.

నారద మహర్షి ఉపదేశాన్ని గ్రహించి ధ్రువుడు ఆ మహాత్మునికి ప్రదక్షిణ నమస్కారాలుచేసి, తపస్సుకై వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత నారదమహర్షి హరికీర్తనం చేసుకుంటూ ఉత్తానపాదుని మందిరం చేరాడు. దేవర్షి ఆగమన సమాచారం విని చక్రవర్తి ఆయనను యథోచితంగా సత్కరించాడు. మహర్షి చక్రవర్తి నుద్దేశించి "రాజా! నీ ముఖం వాడిపోయిందేమి? దేనిని గురించి నీవు దీర్ఘంగా ఆలోచిస్తున్నావు? నీ రాజ్యంలో ధర్మార్థకామాలకు లోపంలేదుకదా?" అని ప్రశ్నించగా–

"దేవర్షీ! నేను భార్యాదాసుడనై నిర్దయుడనై ఐదేళ్ళ పసివాడైన ధ్రువుని అడవులపాలుచేశాను. సుకుమారుడైన బాలుడు ఆకలిదప్పుల కారణంగా శుష్కించిపోతాడేమో! అలసి అతడు కదలజాలని వేళలో నిస్సహాయంగా మార్గమధ్యంలో పడిపోగా, ఏ క్రూరమృగాలో తినివెయ్యకుండా ఉంటాయా? నేనెంత స్త్రీదాసుడి నయ్యాను! పసివాణ్ణి నా ఒడిలో కూర్చోనీయకుండా నివారించితినే! ఎంత దుర్మార్గానికి ఒడిగట్టితిని" అని తన మనోవేదనను వ్యక్తంచేశాడు. అదిచూసి నారదుడు– "ఉత్తానపాదా! నీవు నీ కుమారుని గురించి విచారించపనిలేదు. ఆ బాలుని పరంధాముడే సంరక్షించుకోగలడు. నీ కుమారుని శక్తి నీకు తెలీదు. అతని యశస్సు విశ్వవ్యాప్తం కాగలదు. పసివాడైనా అతడు చాలా సమర్థుడు. ఇంద్రాదిలోకపాలురుసైతం సాధించలేని దానిని అతడు సాధించగలడు. శ్రీహరి అనుగ్రహాన్నిపొంది, తాను తలచిన కార్యాన్ని సాధించి గాని నీ దగ్గరికి వస్తాడు. అతనివలన నీ కీర్తికూడా విస్తరిస్తుంది" అన్నాడు.

దేవర్షివచనాలను ఆలకించిన ఉత్తానపాదుడు రాజకార్యాలయందు ఉదాశీనుడై పుత్రునియందే మనసు నిలిపి, అదే విచారంతో ఉండిపోయాడు.

ఇక్కడ ధ్రువుడు యమునాతీరానగల మధువనంచేరి ఆ నదీ జలాలతో నారదమహర్షి వచనానుసారం ఏకాగ్రచిత్తుడై నారాయణుని ఉపాసించసాగాడు. ఆ మహాదీక్షలో అతడు మూడురోజులకు ఒకసారి మాత్రం వెలగపళ్ళూ, రేగుపళ్ళూ తింటూ నారాయణోపాసన చేస్తుండగానే ఒకనెల గడిచిపోయింది. రెండవనెలలో అతడు ఆరురోజులకు ఓ సారిమాత్రం పండిరాలిన ఆకులను తింటూ భగవత్సేవ చేయసాగాడు. మూడవమాసం ప్రవేశించడంతో తొమ్మిది రాత్రులకు ఒక్కసారి మాత్రం భుజించి తృప్తి చెందుతూ సమాధిస్థితిలోనే హరిధ్యానం చెయ్యసాగాడు. నాల్గవమాసంలో పన్నెండురోజులకు ఓసారి శ్వాసపీలుస్తూ వాయువును కూడా జయించి, ధ్యానయోగంద్వారా శ్రీహరిని సేవించసాగాడు. ఐదవనెలలో మొదటినుండే శ్వాసనుకూడా బంధించి ఏకపాదంమీద నిలబడి పరబ్రహ్మను గురించి ధ్యానముచేస్తూ స్తంభమువలె నిలబడినాడు. పరబ్రహ్మనతడు ధారణచేసిన వేళలో ముల్లోకాలు కంపించసాగాయి. బొటనవ్రేలుమీద నిలబడి అతడు తపస్సుచేస్తుండగా భూమండలమంతా చలించిపోసాగింది. ధ్రువుడు ఇంద్రియాలద్వారా ప్రాణవాయువును నిరోధించి అనన్యాయత్తచిత్తంతో శ్రీహరిని ధ్యానించసాగాడు. అలా పరమ భాగవతోత్తముడైన ధ్రువుడు సయిష్టిప్రాణంతో అభిన్నంగా ఉండటంవలన జీవరాశుల శ్వాస నిరోధించబడింది. అందువల్ల సర్వలోకాలకు, లోకపాలురకూ కూడా పీడకల్గింది. దానితో సర్వులూ నారాయణుని శరణువేడారు.

"శ్రీహరీ! దేవా! స్థావర జంగమాత్మక జీవులన్నింటికీ ఒక్కసారిగా ప్రాణనిరోధం కలిగింది. మునుపెన్నడూ ఇలాంటి పరిస్థితి కలుగలేదు. శరణాగతరక్షకుడవైన నిన్ను శరణువేడుతున్నాము" అని అర్థించిన అమరగణములను ఉద్దేశించి "దేవతలారా! మీరు భయపడకండి. ఉత్తానపాదుని కుమారుడైన ధ్రువుడు తన మనస్సును నాయందు

లగ్నంచేసి తపస్సు చేస్తున్నాడు. నాతో అతనికి భేదంలేకపోవటంవల్ల యావద్విశ్వానికీ ప్రాణనిరోధం ఏర్పడింది. మీరు మీమీ లోకాలకువెళ్ళండి నేనా బాలునికి దర్శనమిచ్చి తపస్సునుండి విరమింపచేస్తాను" అన్నాడు.

అంత అమరులు భయమువీడి తమస్వస్థానాలకు మరలిపోయారు. శ్రీహరి గరుడారూఢుడై భక్తశిరోమణి ధ్రువుడు తపస్సుచేస్తున్న మధువనానికి వచ్చాడు. ఆ సమయంలో ధ్రువుడు యోగాభ్యాసంవల్ల ఏకాగ్రచిత్తుడై బుద్ధిద్వారా మెరపుతీగవలె మెరిసిపోతూ హృదయంలో ధ్యానిస్తూ శ్రీహరిని కనులు తెరిచి ప్రత్యక్షంగా దర్శించాడు.

భగవద్దర్శనం వలన కలిగిన ఆనందంలో అతనిదేహం పులకరించసాగింది. కనులనుండి ఆనందభాష్పాలు జలజల రాలుతున్నాయి. కంఠం గద్గదికమైంది. అపరిమితానందంతో శ్రీహరిపాదాలపై సాష్టాంగపడి ప్రణామంచేశాడు.

లేచినిలబడి రెప్పవేయక దేవుని దర్శించసాగాడు. ముకుళితహస్తుడై ధ్రువుడు నారాయణుని స్తుతించాలనుకున్నాడు. కాని, ఎలా స్తుతించాలో తెలియలేదు. అంత భగవానుడతని భావాన్ని గ్రహించి తన చేతిలో ఉన్న వేదమయ శంఖాన్ని అతని కపోలభాగంలో ఉంచాడు. ధ్రువుడు భవిష్యత్తులో అచంచలస్థానాన్ని పొందేవాడు కావడంవల్ల, ఆ శంఖస్పర్శతో అతనికి దివ్యవాణి లభించింది. జీవబ్రహ్మల స్వరూప జ్ఞానం కలిగింది. విశేషభక్తి భావంతో అతడీ విధంగా శ్రీహరిని స్తుతించసాగాడు.

"భగవాన్! సర్వశక్తిమంతుడవైన నీవే నా మనసులో ప్రవేశించి నీ తేజస్సుతో, నిద్రావస్థలోనున్న నా వాణిని మేల్కొల్పావు. నా ఇంద్రియాలు, ప్రాణాలు నీవల్లనే చైతన్యవంతములవుతున్నాయి. సర్వాంతర్యామివైన నీకు నమస్కరిస్తున్నాను. ఏకమాత్రుడవై ఉండికూడా నువ్వు అనంత గుణాలుకల నీ మాయద్వారా ఈ విశ్వాన్ని సృజించి అంతర్యామిరూపంలో ఇందులో ప్రవేశిస్తున్నావు. సృష్ట్యారంభంలో పరమేష్ఠి కూడా నీ అనుగ్రహంవల్ల పొందిన విజ్ఞానం వల్లనే నిద్రనుండి మేల్కొన్నవానివలె ఈ విశ్వాన్ని

దర్శించాడు. జగత్ప్రభూ! నాకు సత్సాంగత్యాన్ని అనుగ్రహించు. దేవా! నీ చరణారవింద సుగంధా ఘ్రాణంలోనే లగ్నమనస్కులైన సజ్జనుల సాంగత్యం కలవారికి అత్యంత ప్రియమైన ఈ శరీరంతో కాని, దేహసంబంధమైన దార పుత్రమిత్ర గృహధనాదులందుగాని ఆసక్తి ఉండదు. అట్టివారు భగవత్సేవలోనే ఆనందిస్తూ ప్రపంచాన్నే మరిచిపోతారు. పరాత్పరా! పశు, వృక్ష, పర్వత, పక్షి, సరీసృప, దేవమనుష్యాదులవల్ల పరిపూర్ణమైన, స్థూలమైన విశ్వరూపాన్ని నేను తెలుసుకున్నాను. ఈశ్వర రూపం కన్న పరమైన నీ యీ పరమస్వరూపాన్ని వేదాలుసైతం వర్ణించలేక పోతున్నాయో, ఆ నీరూపం నాకు తెలియడంలేదు.

దేవదేవా! కల్పాంతంలో యావద్విశ్వాలనన్నింటినీ తన ఉదరంలో లయంచేసుకొని, ఏ పరమపురుషుడు శేషతల్పంమీద, యోగ నిద్రాపరవశుడై ఉంటాడో, ఎవని నాభినుండి సువర్ణకమలం ఆవిర్భవిస్తుందో! దానినుండి తేజోమయుడైన చతుర్ముఖబ్రహ్మ ప్రభవించాడో, ఆ ఆది పురుషుడవు నువ్వే. అలాంటి నీకు ప్రణామములు. జగన్నాధా! నీవు నీ అఖండ చిన్మయ దృష్టితో బుద్ధి సంబంధమైన సర్వావస్థలలోనూ సాక్షీరూపుడవుగా ఉంటావు. సర్వజ్ఞుడవూ పరమాత్మస్వరూపుడవూ, నిర్వికారుడవూ, ఆదిపురుషుడవూ నీవే. జీవునికి సర్వదా అభిన్నంగా వుండే నీవు లోకస్థితికోసం, యుగాధిష్ఠాతవుగా విష్ణురూపాన తేజరిల్లుతుంటావు. విద్యావిద్యాది విరుద్ధగతులు గల శక్తులన్నీ నీ నుండియే ధారా వాహినిగా ఆవిర్భవిస్తున్నాయి. జగత్కారణుడవు, అనాదివి, అనంతుడవు, అఖండానందస్వరూపుడవు, నిర్వికారుడవు, పరబ్రహ్మవు నీవే. అట్టి నిన్ను నేను శరణువేడుతున్నాను. నిన్ను పరమానందమూర్తిగా భావించి, సేవించేవారికి రాజ్యాది భోగాలకన్నా, నీ చరణకమలప్రాప్తియే వారిసేవకు యథార్థమైన ఫలము. అయినా గోవు దూడకు పాలు యిస్తూ వ్యాఘ్రాదులబారి నుండి రక్షించునట్లే, నీవు కూడా అజ్ఞానులైన నావంటి సకామభక్తుల వాంఛలు నెరవేరుస్తూ సంసారభయం నుండి రక్షిస్తూ ఉంటావు".

ధ్రువుడు ఈ విధంగా స్తుతించగా, భక్తవత్సలుడైన శ్రీహరి

అనుగ్రహిస్తూ, "రాకుమారా! ఉత్తమప్రతాపలంబనుడవైన నీ హృదయగత సంకల్పం నాకు తెలుసు. నువ్వు కోరినవరం కఠినమైనదే అయినా నీకు ప్రసాదిస్తున్నాను. వత్సా! నీకు శుభమగుకాక, తేజోమయము, అవినాశమై, గతమందు ఎవరు పొందనట్టి మహోత్తమ లోకాన్ని నీకు తపఃఫలంగా అనుగ్రహిస్తున్నాను. ఏమండలాన్ని పరివేష్టించి, గ్రహనక్షత్రగణ రూపమైన జ్యోతిశ్చక్రం స్తంభానికి బంధించిన వృషభసమానంగా పరిభ్రమిస్తూ ఉంటుందో, అట్టిమహోన్నత స్థానాన్ని ఇంతకుపూర్వం ఎవరూ పొందలేదు. కల్పాలపర్యంతము ఏమండలం నాశనంకాదో, తారాగణసహితంగా, ధర్మ, అగ్ని, కశ్యప, శుక్రాది నక్షత్రాలు, సప్తర్షులు, ఏ మండలానికి ప్రదక్షిణం చేస్తుంటారో, ఆ లోకాన్ని నీకు ప్రసాదిస్తున్నాను. ఇహంలోకూడా నీ జనకుడు తన సింహాసనాన్ని నీకేఒప్పగించి వెళ్ళిపోతాడు. అంత దీనిని నీవు చిరకాలం శాసిస్తావు. నాడు ధర్మం నాలుగుపాదాలతోను తేజరిల్లుతుంది. సర్వదా సంపూర్ణస్థాయిలో ఇంద్రియశక్తి నీకు సహకరిస్తుంది. ఐహికభోగాలన్నీ, అనుభవించి అంతంలో నువ్వు నన్ను స్మరిస్తావు. తత్కారణంవల్ల అత్యున్నతమై, సర్వజనపూజనీయమై సప్తర్షిమండలానికి కూడా, ఉపరిభాగాన భాసిల్లే నా పరమధామాన్ని నీవు పొందుతావు. ఆ స్థానాన్ని పొందిన వారికి పునర్జన్మ ఉండదు. నిరతిశయానందానుభూతి కలుగుతుంది" అంటూ ధ్రువునిచే పూజితుడై అతడలా సందర్శిస్తుండగానే శ్రీహరి అంతర్ధానమైపోయాడు. భగవత్సేవవల్ల సంకల్పం నెరవేరడంతో ధ్రువుడు సంకల్పనివృత్తుడయ్యాడు. అయినా అతనికి విశేషానందం కలుగలేదు".

ధ్రువుని హృదయం సవతితల్లి వాగ్బాణాలతో గాయపడి ఉంది. వరంపొందే సమయంలో కూడా అతడు అదేస్మరిస్తూ ఉండటంవల్ల ముక్తిదాత అయిన మాధవుడు వరమిస్తానన్న వేళలో, ముక్తిని కోరక, మహోన్నతస్థానాన్ని కోరాడు. ఇప్పుడు శ్రీహరి దర్శనంవల్ల మనోమాలిన్యం దూరమై, జ్ఞానం ఉదయించింది. తన అజ్ఞానానికి పశ్చాత్తాపం చెందుతూ ధ్రువుడు మనసులో ఇలా అనుకోసాగాడు.

"ఊర్ధ్వరేతస్కులైన సనకాది పరమసిద్ధులుకూడా అనేక జన్మలలో

తపస్సుచేసి ఎవనిని సందర్శించజాలకున్నారో? అట్టి పరమాత్మను నేను అచిరకాలంలోనే పొందగలిగాను. కాని మందుడనై ప్రపంచ భోగవాసనలను విడనాడజాలక ఆ దేవదేవునికి దూరమయ్యాను. ఎంత దురదృష్టవంతుణ్ణి? సంసారబంధంనుండి విముక్తిచేయగల ప్రభువును దర్శించి కూడా అనిత్యమైన స్థానాన్నే కోరాను. అమరులుసైతం భోగానుభవానంతరం స్వర్గంనుండి పతనమవుతున్నారు. వారే నా ఉత్తమస్థితిని దర్శించజాలక నా బుద్ధికి దోష దృష్టిని కలిగించారు. మందుడనై నేను దేవర్షి ఉపదేశాన్ని గ్రహించలేకపోయాను. ఈ విశాలవిశ్వంలో ఆత్మకన్న భిన్నమైన వస్తువులేదు. అయినా స్వప్నంలో కల్పితమైన వ్యాఘ్రాదులను చూచి, మానవుడు భీతిచెందునట్లు నేను కూడా మాయామోహితుడనై, సోదరుణ్ణే శత్రువుగా భావించి, దోషరూపమైన హృదయరోగంతో బాధింపబడ్డాను. యోగులకు కూడా దుర్లభమైన పరమపురుషుణ్ణి తపస్సుద్వారా ప్రసన్నుణ్ణి చేసుకొని కూడా వ్యర్థమైన వరాన్ని అర్థించాను. ఆయుర్దాయంలేనివారికి చేసిన చికిత్సవలె నా తపస్సు కూడా వ్యర్థమైపోయింది. నేనెంత దురదృష్టవంతుణ్ణి! సంసారబంధాలను నాశనంచేసే పరమాత్మను పునః సంసారమే కావాలని అర్థించానే! ఇంతకన్న మూర్ఖత్వం ఉంటుందా? యాచకుడు ప్రభువును ఆనందపరిచి గుప్పెడు ధాన్యాన్ని కోరినట్లు అఖండానందప్రదాత అయిన శ్రీహరిని ప్రసన్నుణ్ణి చేసుకొని గర్వ నాశనాలకు కారణమైన మహోన్నతస్థానాన్ని ప్రసాదించుమని కోరితినే" అని అతడనేక విధాల విచారించసాగాడు.

పరమభక్తులయిన వారు నిరంతరం నారాయణ భగవచ్చరణసేవ చేస్తుంటారు. తమంతతామై లభించిన సర్వవస్తువులవల్ల ఆనందిస్తూ, సంతృప్తిని పొందుతూ ఉంటారు. నిత్యసంతుష్టులైన భక్తులకు పరమేశ్వరసేవకన్న మిన్న అయిన కోరిక ఏముంటుంది.

ధ్రువుడు భగవద్దర్శనాన్ని పొంది వరాలందుకొని తపస్సిద్ధుడై మరలివస్తున్నాడన్న వార్త ఉత్తానపాద చక్రవర్తికి తెలిసింది. కాని, యమసదనం చేరినవాడు మరలివస్తున్నాడన్న వార్తను విశ్వసించలేనట్లే ధ్రువుని ఆగమన సమాచారాన్ని ఆ చక్రవర్తి నమ్మలేకపోయాడు. పైగా

తనకంతటి అదృష్టమా! అనుకున్నాడు. అంతలో మెరుపుమెరిసినట్లు దేవర్షి పలుకులు మదిలో మెదలగా ధ్రువుని ఆగమన విషయమై ఆయనకు విశ్వాసం కలిగింది. ఆ మహానందంలో అతడు ధైర్యాన్ని కోల్పోయాడు. వెంటనే బుద్ధిని లగ్నంచేసి ఆ మంగళకర సమాచారాన్ని అందించిన దూతకు అమూల్యహారాన్ని బహూకరించాడు. కుమార దర్శనాసక్తితో అతడు మంత్రిపురోహిత, బంధుబాంధవ సమేతంగా ఉత్తమాశ్వయుక్తమైన రథాన్ని అధిరోహించి మార్గాన్ని అనుసరించాడు. మహారాజు పురోగమిస్తుండగా ఆయనకు ముందు వేదవిదులైన బ్రాహ్మణులు స్వస్తిమంత్రాలు పఠిస్తున్నారు, శంఖ, దుందుభి, వీణ, వేణు మృదంగాది మంగళధ్వనులు మిన్నుముడుతూన్నాయి. రాణులైన సురుచి, సునీతి కూడ ఉత్తముని వెంటబెట్టుకొని ఆందోళికలను అధిరోహించి వస్తున్నారు. సరిగ్గా మహారాజు భవనాన్ని సమీపించేసరికి అగ్నిసమేతుడైన ధ్రువుడక్కడకు వచ్చాడు. పుత్రుని చూసినంతనే ఉత్తానపాదుడు రథందిగి అత్యాతురతతో దీర్ఘంగా నిట్టూరుస్తూ పరుగెత్తి తనయుణ్ణి గాఢంగా కౌగలించుకున్నాడు. ధ్రువుడు గతంలోని ధ్రువుడుకాదు. పరమపురుషుడైన శ్రీహరిసేవచే పాపరహితుడై హరిసందర్శనంవల్ల పరిశుద్ధాత్ముడై ఉన్నాడు. అట్టి భక్తశిరోమణి అయిన బిడ్డను చూడటంవలన ఉత్తానపాదుని మనోరథం సంపూర్ణంగా నెరవేరింది. అతడు పదేపదే పుత్రుని శిరస్సును స్పృశిస్తూ ఆనందంవల్ల కలిగిన భాష్పములతో అతణ్ణి తడిపాడు.

అనంతరం భక్తాగ్రగణ్యుడైన ధ్రువుడు పితృచరణకమలాలకు సాష్టాంగనమస్కారం చేసి, ఆయనవల్ల ఆశీర్వాదాలు పొంది, కుశలాదికాలు అయిన తరువాత తల్లులిద్దరికీ సాష్టాంగప్రణామం చేశాడు. సవతి తల్లి అయిన సురుచి తనకు నమస్కరిస్తున్న ధ్రువుని లేవనెత్తి హృదయానికి హత్తుకుని అశ్రుపూర్ణ నయనాలతో గద్గదకంఠియై "చిరంజీవోభవ" అని ఆశీర్వదించింది. స్వతః సిద్ధంగా నీరుపల్లానికే ప్రవహించినట్లు, మైత్రీ ఆదిగాగల గుణాలుకల ఏ మానవునిలో భగవదనుగ్రహం ఉంటుందో, అతని సమక్షంలో సర్వులూ శిరస్సులు వంచవలసినదే. ఆ తరువాత సోదరులైన ఉత్తముడు, ధ్రువుడు పరస్పరం ఆలింగనం చేసుకుని ప్రేమ విహ్వలులై పోయారు. అంగస్పర్శవల్ల ఇరువురిగాత్రాలూ గగుర్పొడిచాయి. ధ్రువజనని

సునీతి ప్రాణాధికప్రియుడైన పుత్రుని గాఢాలింగనం చేసుకొని క్లేశాలన్నింటినీ విస్మరించింది. పుత్రగాత్రపరిష్వంగంవల్ల ఆమె బ్రహ్మానందాన్ని పొందింది. ఆమె నయనాలనుండి ఆనందభాష్పాలు జలజల రాలుతున్నాయి. ఆ సమయంలో నగరవాసులందరూ ఆమె భాగ్యాన్ని ప్రశంసిస్తూ– "అమ్మా! నీకు పుత్రవియోగం కలిగినా భాగ్యశాలివి కావడంవల్లనే మరల నీబిడ్డను పొందగలిగావు. ఈ సమయం నీకేకాక మా అందరికీ కూడా మహానందదాయక మైనది. ఈ బాలుడీ భూమండలాన్ని చిరకాలం పాలించగలుగుతాడు. శరణాగతరక్షకుడైన శ్రీహరిని సేవించినవాడు అజేయమైన మృత్యువును కూడా జయించగలుగుతాడు" అన్నారు.

పురజనులందరూ ధ్రువకుమారునియందు అపారమైన ప్రేమను వెల్లడించే వేళలో ఉత్తమ సమేతంగా కుమారధ్రువుని గజాధిరోహణం చేయించి రాజధానీ నగరానికి తీసుకువెళ్ళసాగారు ఉత్తానపాదచక్రవర్తి. "ఇంత చిన్నవయస్సులోనే ధ్రువుడు శ్రీహరి విశేషానుగ్రహానికి పాత్రుడయ్యాడు కదా! అంటూ రాజవీధులలోని నారందరూ ఆనందిస్తూ స్తుతించసాగారు. నగరవీధులలో మకరతోరణాలు అమర్చబడ్డాయి. ఫలపుష్పాలతో అనేక విధములుగా అమర్చబడి ఉభయపార్శ్వాలలో ఫలాలతో కూడిన అరటిస్తంభాలు కట్టబడి లేతపోక స్తంభాలుకూడ అమర్చబడి నగరం నవ్యశోభలతో ప్రకాశించసాగింది. చూతపల్లవాలతో చిత్రవిచిత్రవస్త్ర పుష్పాదులతో అలంకృతాలైన కలశాలలో దీపాలువెలిగించి, ద్వారాలదగ్గర ఉంచారు. గోపురప్రాకారాదులన్నీ స్వర్ణకలశాలతో అలంకరించబడ్డాయి. నగరంలోని చతుష్పథాలూ, రాజమార్గాలూ, సందులూ ఆదిగాగలవన్నీ చందనోదకాలు చల్లబడివున్నాయి. లాజ, అక్షత, పుష్ప ఫలాది మంగళ ద్రవ్యాలతో నిండి ఉన్నాయి. ధ్రువుడలా పయనిస్తుండగా మధ్యమధ్య గుంపులు గుంపులుగా చేరిన శీలవతులైన పుణ్యాంగనలు నిలిచి వాత్సల్యభావంతో మంగళాశీర్వాదాలు చేస్తూ, తెల్లటి ఆవాలు, అక్షింతలు, పెరుగు, నీరు, దూర్వాంకుర, ఫలపుష్పాలను వెదజల్లుతున్నారు. వారి మనోహరగానాలను ఆలకిస్తూ ధ్రువుడు పితృ భవనంచేరుకున్నాడు.

స్వర్ణమాణిక్యాలతో నిర్మించబడ్డ అమూల్యమైన ఆ భవనంలో ప్రవేశించి పితృదేవుని అపార ప్రేమానురాగాలచే పులకితుడై అమరులు స్వర్గధామంలో ఆనందించేటట్లు ధ్రువుడు ఆనందించసాగాడు. పాలనురుగు వంటి వర్ణంకల హంసతూలికాతల్పాలు, గజదంతనిర్మితాలైన శయ్యలు, హేమనిర్మితాసన పాత్రాదులక్కడ అసంఖ్యాకంగా ఉన్నాయి. స్ఫటిక, మరకతమణి నిర్మితాలైన ద్వారాలలో రత్ననిర్మిత సుందర స్త్రీవిగ్రహాలపై అమర్చబడిన మణిమయదీపాలు దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నాయి. రాజభవనానికి నలుమూలల్లోనూ, నానావిధాలైన, దివ్యశోభితాలైన ఉద్యానవనాలు, అందులో శుకపికశారికాది పక్షుల కిలకిలారావాలు, భ్రమరాలఝుంకార నాదాలు, మనోనయన శ్రవణేంద్రియాలకు ఆహ్లాదాన్ని కలుగచేస్తున్నాయి. ఆ సుందరోద్యానవనాలలో, వైఢూర్యమణిసోపానాలు, నీలారుణశ్వేతవర్ణాలుకల వికసితకమలాలతో ఆనందాన్ని ప్రసాదించే సరోవరాలు, వీటిలో చక్రవాక, బక, సారసాది పక్షులు విహరించటం తిలకిస్తుంటే చూడడానికి అవి నందనోద్యానవనాన్ని మరపింపచేస్తున్నాయి.

ధ్రువకుమారుని విషయం ఉత్తానపాద చక్రవర్తి నారదదేవర్షిద్వారా విన్నాడు. ఇప్పుడది ప్రత్యక్షంగా చూసి అత్యాశ్చర్యం పొందాడు. కాలచక్రం వేగముగ పరిభ్రమించడంతో ధ్రువుడు యవ్వనంలో అడుగుపెట్టాడు. మంత్రిమండలి అతణ్ణి అత్యాదరంతో తిలకించసాగింది. ఆ పరిస్థితి గ్రహించి ఉత్తానపాదుడు ధ్రువుణ్ణి భూమండలాధిపతిగా పట్టాభిషిక్తుణ్ణి చేశాడు. తన వార్ధక్యాన్ని పురస్కరించుకొని సర్వసంగపరిత్యాగియై ఆత్మనిష్ఠుడై అరణ్యాలకు వెళ్ళిపోయాడు".

కాలచక్రం 'పరిభ్రమిస్తున్నది'. శిశుమారపుత్రి అయిన 'భ్రమి' అనే కన్యను ధ్రువుడు వివాహం చేసుకున్నాడు. ఆ రాజదంపతులకు కల్పుడు, వత్సరుడు అని ఇద్దరు కుమారులు కలిగారు.

ఒక నాడు సురుచి కుమారుడైన ఉత్తముడు అరణ్యానికి వేటాడవెళ్ళాడు. ఆ సమయాన మహాబలశాలి అయిన యక్షుడొకడు అతణ్ణి సంహరించాడు. దానితో కుమారునితో సురుచికూడా పరలోకం చేరింది. ఆ వార్తవిన్న

ధ్రువుడు క్రోధశోకావేశితుడై విజయ సాధనమైన రథాన్ని అధిరోహించి యక్షులకు నివాసస్థానమైన హిమలయాలుచేరి అక్కడ యక్షసమూహసంభరితమైన అలకాపురిని తిలకించాడు. ఆ పట్టణంలో భూతప్రేతపిశాచాది రుద్రగణాలు అసంఖ్యాకంగా ఉన్నాయి. మహాతేజశ్శాలి అయిన ధ్రువుడు ఆ నగరంలో ప్రవేశించి దశదిశలు పిక్కటిల్లేలా శంఖాన్ని పూరించాడు. ఆ శంఖనాద శ్రవణ మాత్రంచే యక్షపత్నుల గుండెలదరగా వారు భయభీతులై చూస్తుండిపోయారు. మహా బలశాలురైన యక్షులాశంఖనాదాన్ని విని సహించజాలక శస్త్రపాణులై పురసమీపంలో నున్న ధ్రువునిపై విరుచుకు పడ్డారు. మహారథి అయిన ధ్రువుడు ఆ యక్షవీరులలో ఒక్కొక్కరిపై మూడేసి బాణాలు వేస్తుండటం చూసి వారతని పరాక్రమాన్ని ప్రశంసిస్తూనే కాలనాగులవలె బుసలు కొడుతూ ధ్రువునిపై ఒక్కొక్కరు ఆరేసి బాణాలు ప్రయోగించారు. యక్షులు అసంఖ్యాకంగా ఉన్నారు. వారందరికందరూ ప్రతీకారేచ్ఛతో రథసారథులతో ధ్రువుని అంతంచెయ్యాలని ఖడ్గ, పరిఘు, పాశ, శూల, పరశు, శక్తి, తోమరాది ఆయుధాలను ప్రయోగించసాగారు. ఆ శరవర్షంవలన ధ్రువుడు కనపట్టంలేదు. ఆ సమయంలో సిద్ధులందరూ ఆకాశవీధిలో నిలబడి 'అయ్యో! యక్షరూపసాగరంలో మానవరూప భాస్కరుడు అస్తమించాడే' అని అనుకోసాగారు. జయజయ అని పలుకుతూ యక్షులు సింహనాదాలు చెయ్యసాగారు. అదే సమయంలో మంచుపొగనుండి బహిర్గతుడైన భాస్కరునివలె, యక్షసేనా సమూహ విముక్తమైన మార్తాండునివలె ధ్రువుడు కూడా యక్ష సమూహంనుండి బయల్వెడలి నారిసారించి ధనుష్టంకారం చేస్తూ, ప్రచండ వాయువు మహామేఘాలను, నిమేషమాత్రకాలంలో చెల్లాచెదరు చేసినట్లు, నిజనిశిత శరపరంపరలతో యక్షుల శస్త్రాస్త్రాలను ఛిన్నాభిన్నం చెయ్యసాగాడు. మహేంద్రునిచే ప్రయోగింపబడ్డ వజ్రం పర్వతాన్ని ఛేదించినట్లు ధ్రువధనుర్విముక్త శస్త్రాలు, యక్షులు ధరించిన కవచాదులను ఛేదించి వారిదేహాలలో ప్రవేశిస్తున్నాయి. మహావీరుడైన ధ్రువుని నిశితశరాలచే ఖండితమైన, సుందర కుండలాలచే ప్రకాశించే శిరస్సులు, తాళవృక్షసమమైన జంఘాలు కంకణాలంకృతాలైన బాహువులు, ఛిన్నాభిన్నములైన హారకటకకేయూర కిరీటాదులూ రణరంగంలో అస్తవ్యస్తంగాపడి ఉన్నాయి.

మహా వీరులమని గర్వించిన యక్షులు ధ్రువుని శరపరంపరలకు రక్తసిక్తమైన దేహాలతో వాహనాల సహకారంతో రణస్థలంనుండి పలాయనం చిత్తగించారు. అలా పారిపోయినవారు బ్రతికి పోయారు. ధ్రువునికి ఎదురైె నిలిచినవారు ఉత్తరక్షణంలోనే యమసదనం చేరుకుంటున్నారు.

హతశేషులైన యక్షులు రణక్షేత్రంనుండి పారిపోయారు. అందరు పారిపోయి అలకాపురి నగరంలో ప్రవేశించటం చూసిన ధ్రువునికి మహాశ్చర్యం కలిగింది.

"వీరు మహా మాయావులు. ఏ మాయనైనా పన్నగలరు, నూతనంగా సాగించే వీరి యుద్ధవిధానాన్ని నేను సావధానంగా పరికించాలి" అని అతడు సారథితో సంభాషిస్తుండగానే ఆకాశమంతా మేఘావృతమై, భయంకర గర్జనలతో మెరుపులు మెరవసాగాయి. వాటి నుండి చీము, నెత్తురు, మలమూత్రాలు మొదలైనవి వర్షంవలె పడసాగాయి. అంతేకాదు ఆకాశంనుండి రాళ్ళవాన, దానితో పాటు గద, పరిఘ, ఖడ్గ, ముసల, ధనురాది ఆయుధములు కూడా వర్షంలా పడుతున్నాయి. భయంకర సర్పాలు అగ్నివర్ణ నేత్రాలతో నోటినుండి విస్ఫులింగాలు చిమ్ముతూ అనేకంగా వస్తున్నాయి. ఇంకా మత్తేభ, సింహ, వ్యాఘ్రాలు, కూడా పరిగెత్తుకు వస్తున్నాయి. ధైర్యహీనులకు భయంకలిగించే విధంగా, ప్రళయసమంగా సముద్రం ఉప్పొంగి నాలుగు దిక్కులనుండి భూమినాశ్రయించి వస్తున్నట్లు కనిపించసాగింది. యక్షులావిధంగా ఆసురీమాయను ప్రయోగించి ఆ రీతిగా దృశ్యాలను ప్రదర్శించసాగారు. వారు ధ్రువునిమీద పరిపూర్ణమైన మాయను ప్రయోగించడంచూసి ఋషులు అనేకమంది అక్కడికి వచ్చారు. ధ్రువునికి శుభం కోరుతూ భగవంతుణ్ణి ప్రార్థించి, అతడితో ఇలా అంటున్నారు.

"వత్సా! ధ్రువా! శరణాగతత్రాణపరాయణుడైన శారంగపాణి నీ శత్రువులను అంతం చేయునుగాక! భగవన్నామ స్మరణ మాత్రంచేతనే మానవమాత్రులు భయంకర మృత్యువునే జయించగలుగుతారు" అని మౌనం వహించారు. మహర్షుల వచనాలు వింటూనే ధ్రువుడు ఆచమనం

చేసి నారాయణాస్త్రాన్ని శరాసనానికి అనుసంధించాడు. దానితో యక్షనిర్మితమైన మాయాజాలమంతా మటుమాయమైపోయింది. శ్రీహరినే అస్త్రంగా సంధించడంతో అసంఖ్యాక నిశితపరంపరలు భయంకరంగా గర్జించుకుంటూ శత్రుసైన్యంలో ప్రవేశించి వారిని అచేతనులను చేస్తున్నాయి. మహావీరులైన యక్షులు ధ్రువునిచుట్టుముట్టారు. ధ్రువుడు రుద్రసముడై అందరికన్నిరూపులై ఉన్నాడా అన్నట్లు తన బాణాలతో కొందరి చేతులనూ, మరికొందరికాళ్ళనూ ఖండిస్తూ సంహరిస్తున్నాడు. ఇదిచూసి అతని పితామహుడైన స్వాయంభువమనువు - నిరపరాధులైన యక్షులు అనేకమంది అంతమైపోవడంచూసి దయార్ద్రహృదయుడు కావడంవల్ల ఋషిమునిజన పరివేష్టితుడై ధ్రువుని ఎదుటనిలిచి, "వత్సా! ఈ ఘోర మారణహోమాన్ని ఆపుచెయ్యి. క్రోధము నరకానికి ద్వారము. నువ్వు అలాంటి క్రోధాన్ని విడనాడుము. లేకుంటే ఇంకా ఎందరో నిరపరాధులు బలి అయిపోతారు. నిర్దోషులను అంతంచేయటం మన వంశానికే కళంకము. సజ్జననిందాపాత్రమైన ఇట్టి ఘోరకృత్యాలు చేయరాదు. నీ తమ్ముడిపట్ల నీకు ప్రేమ ఉండటం సహజమే. యక్షుడు నీ సోదరుని అంతం చేసినంతమాత్రాన నిరపరాధులు అసంఖ్యాకంగా అంతంకావడం సముచితమేనా? జడమయమైన ఈ దేహాన్ని విశ్వసించి దీనినే ఆత్మగా భావించి, దీని కోసం పశుసమంగా హింసించడం, భగవత్సేవచేసే సజ్జనులు అనుసరించే మార్గంకాదు. శ్రీహరి భగవానుని ఆరాధించడమే దుర్లభం కాగా నువ్వు చిన్ననాటనే ఆ దేవదేవుని అనుగ్రహంవల్ల పరమపదాన్ని సాధించగలిగావు. భగవంతుడు నిన్ను పరమ భక్తునిగా స్వీకరించాడు. భక్తసమాజంకూడా నిన్ను భక్తశిఖామణిగా భావిస్తున్నది. అట్టి నువ్వేనా ఈ ఘోరకృత్యానికి పూనుకున్నది! దయ అనేది మానవ మాత్రులకు ప్రధానధర్మము. తనకన్న పెద్దలయందు సహనమూ, తనతోటి వారియందు మైత్రి, పిన్నలయందు దయ కలవారినే భగవంతుడు అనుగ్రహిస్తాడు. అట్టివారికే అతడు ప్రసన్నుడవుతాడు. శ్రీహరి ప్రసన్నుడైతే మానవుడు ఈశరీరంనుండి విముక్తుడై పరమానంద రూపమైన బ్రహ్మపదాన్ని పొందుతాడు.

"వత్సా! ధ్రువా! దేహాదులరూపంలో పరిణమించిన పంచమహా

భూతాలనుండియే స్త్రీపురుషులుద్భవించుచున్నారు. పునః వారి సమాగమంవల్లనే స్త్రీపురుషులు ఆవిర్భవిస్తున్నారు. ఈ రీతిగా దైవమాయవల్ల సత్త్వరజస్తమోగుణాలలో కలిగిన హెచ్చుతగ్గుల కారణంగా యీ దేహాలు ఉత్పన్నమవుతున్నట్లే వాటికీ స్థితిప్రళయాలు ఏర్పడుతుంటాయి. నిర్గుణుడైన పరమాత్మ వీటిలో కేవలం నిమిత్తమాత్రుడుగా ఉంటాడు. కాలప్రభావంవల్ల సత్త్వాదిగుణాలలో సంక్షోభం కలగటంవల్ల భగవచ్ఛక్తి కూడా సృష్టిరూపంలో విభక్తమైపోతుంది. కనుకనే భగవంతుడు అకర్త అయికూడా యీ విశ్వాన్ని సృష్టిస్తున్నాడు. సంహారికాకపోయినా సంహరిస్తున్నాడు.

"ధ్రువా! కాలస్వరూపుడై పరమాత్మ అనంతుడైకూడా జగత్తును అంతం చేస్తున్నాడు. ఓ జీవినుండీ మరోజీవిని సృజించి అతడే ఈ విశ్వాన్ని వర్ధిల్లజేస్తున్నాడు. తాను అనాదియైకూడా యావద్విశ్వానికీ ఆదిశక్తగా పరిగణింపబడుతున్నాడు. కాలస్వరూపుడైన అతనికి శత్రుమిత్ర భేదంలేదు. వాయువువీస్తుండగా, దానితోకూడా ధూళిరేగి పయనించునట్లు జీవులన్నీ స్వకర్మాధీనులై సుఖదుఃఖాలను అనుభవిస్తుంటాయి సర్వసమర్థుడైన శ్రీహరి కర్మబద్ధులైనవారికి ఆయుర్వృద్ధిని, ఆయుక్షీణాన్నీ కలగచేస్తుంటాడు. కాని, ఆ దేవదేవుడు వీటన్నిటికంటే అతీతంగా ఉండి స్వస్వరూపంలోనే ఆనందిస్తుంటాడు. ఆ పరమాత్మనే మీమాంసకులు కర్మ అనీ, చార్వాకులు స్వభావమనీ, జ్యోతిష్కులు దైవమనీ, కామశాస్త్రజ్ఞులు కామమనీ అంటుంటారు. (కాని పరమాత్మ ప్రాణేంద్రియాలకు కూడా కారణమైన వాడు కాదు). మహత్ ఆదిగాగల అనేక శక్తులు ఆ శ్రీహరినుండియే ఆవిర్భవించాయి. ఆ శ్రీహరి ఏమి చేయదలచినదీ గుర్తించగలవాడు ఈ చతుర్దశభువనాలలో లేడు. ఇంక తనకు మూలకారణమైన ఆ ప్రభువును గుర్తించగలవాడెవడు?

"నాయనా! కుబేరానుచరులైన యక్షులు నీ సోదరుని చంపినట్టివారు. కారణమేమంటే మానవుని జననమరణాలకు యథార్థమైన కారణం పరమేశ్వరుడే. కనుక అన్యులపై ద్వేషం పనికిరాదు. సృష్టిస్థితిలయాలకు ఆ భగవానుడు మాత్రమే ఏకమాత్రకారణుడైకూడ అహంకారశూన్యుడు

కావడంవల్ల లోకసంబంధమైన గుణకర్మాదులను అంటకుండా ఉంటాడు. సర్వప్రాణులలోనూ అంతరాత్మగా, నియంతగా, రక్షకుడుగా ఉండే ఆ భగవంతుడే సర్వజీవులను, సృజించి పాలించి లయం చేస్తుంటాడు. ముక్కుకు త్రాడువేయబడిన ఎద్దు యజమాని చెప్పుచేతలలో బరువులు మోయునట్లు సృష్ట్యాదులలో ప్రవర్తులైన బ్రహ్మాదులు నామరూపాత్మకమైన రజ్జువుచే బంధింపబడి, భగవదాజ్ఞలను పాలిస్తుంటారు. నారాయణుడు భక్తులకు అమృతస్వరూపుడుగా భక్తిహీనులకు మృత్యురూపుడిగా గోచరిస్తుంటాడు.

చరాచరజగత్తు మొత్తానికి ఏకమాత్రాశ్రయుడు ఒకడే. కనుక నువ్వా పరమాత్మనే ప్రార్థించి శరణువేడుము. పంచవర్ష ప్రాయంలోనే సవతితల్లి అవమానించిందని, అరణ్యాలకిపోయి నీవుతపస్సుద్వారా శ్రీహరిని ప్రసన్నుని చేసుకొని జగత్త్రయానికి పైనున్న ధ్రువపదాన్ని అందుకున్నావు. ద్వేషరహితమైన నీ హృదయంలో వాత్సల్యవశంవల్ల విశేషరూపంలో పరమాత్మయే ప్రకాశిస్తున్నాడు.

నిర్గుణుడు, అద్వితీయుడు, నాశరహితుడు నిత్యముక్తుడూ అయిన పరమాత్మను ఆధ్యాత్మిక దృష్టితో నీ అంతఃకరణంలో దర్శించు. "జగన్మిథ్య బ్రహ్మసత్యం" అన్న నిశ్చయంకలవాడవై పరబ్రహ్మనే నువ్వు ధ్యానించగలిగితే సర్వశక్తి సంపన్నుడు, పరమానందమయుడు, సర్వాంతర్యామి అయిన అనంతుని ఎడల దృఢమైన భక్తికలవాడవయ్యేదవు. ఆ భక్తిప్రభావంవల్ల అహంకార, మమకారరూపమైన అజ్ఞానజనితమైన బంధం నాశనమైపోతుంది. ఓషధివల్ల రోగం నాశమైపోయినట్లు నా ఉపదేశాన్ని నువ్వు సావధాన చిత్తుడవై మననంచేసుకొని ఆలోచిస్తే నీ క్రోధం నాశనమవుతుంది. ప్రమాదకరమైనదీ, మోక్షానికి విఘ్నకారిదైన క్రోధాన్ని త్యజించు. పరమాత్మ నీకు శుభాలను చేకూర్చుకాక! వత్సా! క్రోధోన్మత్తునిమూడ లోకంలో అందరికీ భయం కలుగుతుంది. క్రమంగా లోకంవల్ల వానికీ భయం కలుగుతుంది. కనుకనే ఉత్తములైనవారు తమవల్ల సమాజానికి, సమాజంవలన తమకూ భయంకలుగరాదని కోరుకుంటుంటారు. అట్టివారెన్నడూ కుపితులుకారు.

నిరపరాధులైన అసంఖ్యాక యక్షులను అంతంచేసి నువ్వు శంకర సఖుడైన కుబేరునికే మహాపరాధం చేశావు. కుబేరాదుల తేజస్సు మన కులాన్ని అంతం చేయకముందే నువ్వు వినమ్రుడవై మృదుభాషణలతో వారిని శీఘ్రంగా ప్రసన్నులనుజేసుకో" అని స్వాయంభువ మనువు, తన మనుమడైన ధ్రువునికి ఉపదేశించాడు. దానితో అతడు తన పితామహునికి సాష్టాంగనమస్కారం చేశాడు. అంత స్వాయంభువ మనువు ఋషి, ముని సమేతంగా వెళ్ళిపోయాడు.

తాతగారి ఉపదేశవాక్యాలతో ధ్రువుని క్రోధం శాంతించింది. అతడు యక్షసంహారం ఆపివేశాడు. ఆ సమాచారం విన్న యక్షరాజైన కుబేరుడు అక్కడకు వచ్చాడు. ఆ సమయంలో యక్ష, చారణ, కిన్నరులు కుబేరుని స్తుతిస్తున్నారు. అట్టి కుబేరుణ్ణి తిలకిస్తూనే ధ్రువుడు చేతులు జోడించడంతో కుబేరుడు ప్రసన్నుడై "శుద్ధహృదయా! ధ్రువా! నువ్వు మీ తాతగారి ఉపదేశవచనాలతో త్యజించవీలుగాని వైరభావాన్ని త్యజించుటవలన నేను నీకు ప్రసన్నుడనయ్యాను. సత్యమాలోచింప నువ్వు యక్షులను సంహరించలేదు. యక్షులు నీ సోదరుణ్ణి సంహరించలేదు. సర్వజీవుల ఉత్పత్తి సంహారాలకు కారణం కాలమే. జీవులు అజ్ఞానవశులై స్వప్నతుల్యములైన, దేహాదులలో ఆత్మభావం కలవారు కావడంవలన నీవు, నేను అన్నమిధ్యాభావం కలుగుతున్నది. అట్టి బుద్ధివల్లనే మానవునికి బంధనం, సుఖదుఃఖరూపానుభవం కలుగుతుంది"

ధ్రువా! నీవిప్పుడు స్వగృహానికి మరలి పో. భగవంతుడు నిన్ను అనుగ్రహించునుగాక! సంసారబంధవిముక్తి కోసం, సర్వజీవులయందు సమదృష్టి కలవాడవై, సర్వభూతాంతరాత్ముడైన సర్వేశ్వరుని సేవించుము. ఆ శ్రీహరిదేవుడు సంసారపాశాన్ని ఖండించునట్టివాడు. త్రిగుణాత్మక మాయాశక్తి యుక్తుడైకూడా వాస్తవానికి మాయారహితుడుగానే ఉంటాడు. భక్తధ్రువా! నీవు నిరంతరము శ్రీహరి చరణాలనే ఆశ్రయించి ఉంటావని మేము విన్నాము. అందువల్ల అర్హుడవైననీకు వరాన్ని ప్రసాదించాలనుకుంటున్నాను. కోరుకో అనగా ధ్రువుడు యక్షేశునకు పునః ప్రణమిల్లి, "మహాత్మా! మీకు నాపై పరిపూర్ణానుగ్రహమే ఉంటే సర్వకాల

సర్వావస్థలయందూ నా దృష్టి శ్రీహరియందే లగ్నమగునట్లు వరాన్ని ప్రసాదించండి. శ్రీహరియందు అఖండమైన భక్తి ఉంటే మానవుడు సునాయాసంగా సంసారసాగరాన్ని తరించగలుగుతాడు" అని అర్థించిన ధ్రువునకు కుబేరుడు అఖండమైన భక్తిని ప్రసాదించి అదృశ్యమైపోయాడు.

అనంతరం ధ్రువుడు అపరిమితానందంతో తన రాజధానికి మరలి వచ్చాడు. కాలాంతరంలో అతడు భూరిదక్షిణలతో కూడిన అనేక యాగాలుచేసి యజ్ఞపురుషుని అనుగ్రహాన్ని పొందగలిగాడు. సమస్తమైన ద్రవ్య, క్రియ, దేవ, మంత్రాదులన్నీ భగవత్స్వరూపాలే. కనుక కర్మఫలమూ, ఫలప్రదాత కూడా భగవంతుడే అని గ్రహించి ధ్రువుడు అనేక యాగాలు చేశాడు. పరమాత్మయందు మిగుల భక్తిభావం కలవాడై తనయందు, నిఖిలప్రాణులయందు సర్వవ్యాపకుడై ఉన్న శ్రీహరినే దర్శించసాగాడు.

మహత్తర శీలసంపన్నుడు, ధర్మమర్యాదను అతిక్రమించనివాడు, దీనవత్సలుడు, బ్రాహ్మణభక్తుడు అయిన అతని రాజ్యంలోని ప్రజలు అతణ్ణి కన్నతండ్రివలె చూస్తున్నారు. వివిధైశ్వర్య భోగానుభవంవల్ల పుణ్యాన్ని, భోగత్యాగ పూర్వకమైన యాగాదిసత్కర్మానుష్ఠానం వల్ల పాపాన్ని నశింపచేసుకొని అతడు దీర్ఘకాలం రాజ్యం చేశాడు. మహాత్ముడు, జితేంద్రియుడు అయిన ధ్రువుడు ధర్మకామాలలోనే కొంతకాలంగడిపి చిట్టచివరకు తన పుత్రుడైన ఉత్కళునికి రాజ్యంఅప్పగించాడు. అనంతరం ఈ దృశ్యప్రపంచమంతా స్వప్నతుల్యమైనదని నిశ్చయించుకొని దారాపుత్రాదులను, మిత్రులను, దేహాన్ని, సాగరపర్యంతమైన పృథ్వీమండలాన్ని, తన రాజ్యసర్వస్వాన్ని అస్థిరమని భావించి సర్వసంగపరిత్యాగియై బదరికాశ్రమానికి వెళ్ళిపోయాడు.

కొంతకాలానికి బదరికాశ్రమంచేరి పావనజలాల స్నానంచేసి, ఇంద్రియాలను శాంతింపచేసుకొని, స్థిరాసనుడై, ప్రాణాయామంద్వారా ఇంద్రియాలను, బాహ్యవిషయాలనుండి మరల్చి అంతర్ముఖం చేసి, భగవంతుని స్థూలరూపమైన విరాట్స్వరూపంలో చిత్తాన్ని నిలిపి ధ్యానిస్తూ

మహాత్ముడైన ధ్రువుడు కాలం గడుపుతున్నాడు. నిర్వికల్ప సమాధిలో లీనమైపోయాడు. అట్టిదిశలో విరాట్‌స్వరూపాన్ని కూడా త్యజించాడు. ఈ రీతిగా భగవద్భక్తి నిరంతరం అఖండప్రవాహరూపాన్ని దాల్చడంవల్ల అతని నయనాలనుండి ఆనందబాష్పాలు రాలుతున్నాయి. హృదయం సంపూర్ణంగా ద్రవించసాగింది. శరీరం రోమాంచితంకాగా నవ్యశోభలతో అలరారసాగింది. క్రమక్రమంగా దేహాభిమానంకూడా నశించసాగింది.

ఆ సమయంలో పూర్ణచంద్రుడు ఉదయిస్తున్నట్లుగా, దిశలన్నింటిని ప్రకాశవంతంచేస్తున్న దివ్యవిమానం ఆకాశమార్గంలో ఎగురుతూ కన్పించింది. గదాపాణులై ఇద్దరు పార్షదులు అందులో నిలబడి ఉన్నారు. చతుర్భుజులైన వారు శ్యామసుందరశరీరులై కిశోరావస్థలో ఉన్నారు. అరుణకమలసమమైన నేత్రాలు కలిగి, పీతాంబరధారులై కిరీట, కేయూర, కుండలాలంకృతులై వారు ప్రకాశిస్తున్నారు. పుణ్యశ్లోకుడైన శ్రీహరి సేవకులను ధ్రువుడుగమనించి, తత్తరపాటుతో పూజనుకూడా మరచి లేచినిలబడి, శ్రీహరియొక్క ఆ ప్రధానపార్షదులను తిలకిస్తూ– కేశవ, నారాయణ, వామన, గోవింద, అంటూ మాధవ నామాలనే సంకీర్తనం చేసుకుంటూ చేతులు జోడించి వారికి నమస్కరించాడు. ధ్రువుని చిత్తం శ్రీహరియందే ఆయత్తమై ఉంది. అతడు వినయంగా శిరసొగ్గి సమక్షంలో నిలబడ్డాడు. అంత హరిపార్షదులైన నందసునందులు ధ్రువుని సమీపించి, మందస్మిత సుందరవదనారవిందులై, "రాజా! నీకు శుభపరంపరలు చేకూరును గాక! సావధానుడవై నువ్వు మా పలుకులను ఆలకించుము. పంచవర్షప్రాయంలోనే నువ్వు శ్రీమన్నారాయణ భగవదనుగ్రహానికి పాత్రుడైనవాడవు. మేము సర్వజగన్నియంత అయిన ఆ శ్రీహరిదాసులము. నిన్ను వైకుంఠధామానికి తీసుకెళ్ళడానికొచ్చాము. భక్తి ప్రభావంవల్ల నువ్వు వైకుంఠ ధామాన్నిపొందే అధికారాన్ని సంపాదించావు. అన్యులెవ్వరూ ఇంతవరకు ఆ ధామాన్ని చేరలేదు సప్తర్షులు కూడ ఆ స్థానానికి పోలేదు. క్రింది నుండియేవారు ఆ లోకాన్ని చూస్తుంటారు. సూర్యచంద్రులు గ్రహనక్షత్ర తారాగణం కూడా ఈ మండలానికి ప్రదక్షిణం చేస్తుంటాయి. నువ్వాలోకానికి వెళ్ళు. సర్వజన వందనీయమైన ఆ లోకంచేరి ఆనందించుము. పుణ్యప్రదమైన ఈ విమానాన్ని శ్రీహరిదేవుడు నీకై

పంపాడు. కనుక నువ్వా విమానాన్ని అధిరోహించుము" అని నందసునందులు పలికారు.

మృదుమధురమై, మంగళదాయకమైన వారి దివ్యవచనాలను ఆలకించి ధ్రువుడు బదరికాశ్రమవాసులైన మహర్షిశ్రేష్ఠులకు ప్రణమిల్లి వారి ఆశీర్వాదాలు అందుకున్నాడు. అనంతరం పరమ పవిత్రమైన దివ్యవిమానాన్ని పూజించి ప్రదక్షిణంచేసి, నందసునందులకు కూడా వందనాలందజేసి, దివ్యశరీరాన్ని ధరించి విమానాన్ని అధిరోహించడానికి సంసిద్ధుడవుతుండగా కాలుడు స్వస్వరూపంతో అతని ఎదుట నిలబడ్డాడు. వెంటనే ధ్రువుడు ఆ మృత్యువు శిరస్సుపై కాలుంచి విమానాన్ని అధిరోహించాడు. తత్సమయంలో పూలవాన కురిసింది. దేవదుందుభులు మ్రోగాయి. మృదంగ, వీణా, వేణు, ఢక్కాదులు మారుమ్రోగాయి. గంధర్వులు గానంచేశారు.

విమానాన్ని ఎక్కి విష్ణులోకానికి పయనించనున్న ధ్రువునికి మాతృమూర్తి సునీతి జ్ఞాపకానికి వచ్చింది. అంత ఆతడాలోచించసాగాడు. "నేను దీనురాలైన నా జననిని విడనాడి ఒంటరిగా వైకుంఠ ధామానికి పోతున్నానా?" అని యోచించే ధ్రువుని అంతర్యాన్ని గ్రహించిన నందసునందులు, ధ్రువుని విమానం ముందున్న విమానంలో సునీతి ప్రసన్నవదనంతో ఆసీనురాలై పయనించటం చూపించారు. అంతమహానందంతో అతడు పయనం సాగించాడు. క్రమంగా ఆ విమానం సూర్యాది గ్రహాలను తిలకిస్తూ పురోగమిస్తుండగా, మధ్యమధ్య అక్కడక్కడ విమానంలో తిరిగే దేవతలు అతణ్ణి ప్రశంసిస్తూ పూలవానను కురిపిస్తున్నారు. ధ్రువుడాదివ్య విమానంపై కూర్చుని జగత్త్రయాన్ని అధిగమించి సప్తర్షిమండలానికి ఉపరిభాగంలో భాసిల్లే వైకుంఠ ధామంచేరాడు. ఆ విధంగా ధ్రువునికి అత్యున్నత దివ్యస్థితి లభించినది. స్వయంప్రకాశమానమైన ఆ దివ్యధామంవల్ల ముల్లోకాలు ప్రకాశిస్తుంటాయి. దయాసూన్యులు అక్కడికి వెళ్ళలేరు. శాంతస్వభావం, సమదృష్టి, విశుద్ధాచరణం, భూతదయ, భక్తులను మిత్రులుగా భావించటం అన్న ఈ లక్షణాలు కలవారు మాత్రం సులభంగా వైకుంఠ ధామాన్ని

పొందగలుగుతారు.

భగవద్భక్తుడైన ధ్రువుడు జగత్త్రయానికిపైన చూడామణివలె ప్రకాశిస్తున్నాడు. స్తంభానికి త్రాడుచే కట్టబడిన వృషభం దానిచుట్టు ఎలా తిరుగుతుందో, అలాగే మహాగంభీరమైన వేగంగల జ్యోతిశ్చక్రం ధ్రువమండలం ఆధారంగా తిరుగుతూ ఉంటుంది. దానిమహిమను తిలకించి నారదదేవర్షి" పతిపరాయణురాలైన సునీతి పుత్రుడైన ధ్రువుడు తపస్సు ద్వారా అద్భుతమైన శక్తిని సంపాదించి మహోత్తమ లోకాన్ని పొందగలిగాడు. శ్రీహరి కరుణకు పంచవర్షప్రాయంలోనే పాత్రుడు కాగలిగాడు. దైవానుగ్రహంవల్లనే మహోన్నత స్థానాన్ని అందుకున్నాడు.

ఉదార యశస్సంపన్నుడైన ధ్రువుని చరిత్రను సజ్జనులు విశేషంగా కీర్తిస్తుంటారు. ఈ ధ్రువోపాఖ్యానం యశోధనాలను వర్ధిల్లజేస్తుంది. అత్యంత మంగళప్రదమైన దీనివల్ల స్వర్గమూ, అవినాశమైన పరమపదము కూడా లభిస్తాయి. అమరత్వాన్ని ప్రసాదించే ఈ పావనగాథ సర్వపాపాలను నాశనం చేస్తుంది. ఈ భక్తగాథను పదేపదే వినేవారికి సర్వదుఃఖనాశకరమైన భగవద్భక్తి లభిస్తుంది. అట్టివానికి ఉత్తమశీలాదిగుణాలు లభిస్తాయి. మహత్వాభిలాషులకు మహత్వము, తేజోభిలాషులకు తేజస్సూ, మానవంతులకు మానవృద్ధి కలుగుతాయి. భగవద్విషయకమైన ఈ గాథ అమృతమయమై జ్ఞానాన్ని ప్రబోధిస్తుంది.

— o —

# ఉపసంహారం

ధ్రువునకు లభించిన పదవి స్వప్రకాశంచేతనే ప్రకాశిల్లుతూ ఉంటుంది. సర్వప్రాణులయందు ప్రేమకలిగి, దుఃఖితులపై దయ చూపుతూ భగవంతుని యందు అనన్యానురాగం కలవారు మాత్రమే మహోన్నత స్థానాన్ని పొందగలుగుతారు. భగవంతుని అపారకృపవల్లనే ధ్రువునికి దివ్యజీవనం లభించినది. సేవాభాగ్యం, మహోన్నత స్థితి, ఆమార్గాన్ని అనుసరించేవారికీ కలుగుతాయి. అడుగడుగు పరమాత్మ ధ్రువుని రక్షించినట్లు, అతని అభిలాషలను నెరవేర్చినట్లు, మనంకూడా భగవదోన్ముఖులం కాగలిగితే, అట్టి మహోత్సాహ, భజనలతో జీవనం గడపగలిగితే పరమాత్మ మనలనుకూడా సంరక్షించుటకు సంసిద్ధుడై ఉంటాడు.

కల్ప పర్యంతం ధ్రువుడు ఆ మహోన్నత స్థానంలో భగవల్లీలలను అనుభవిస్తుంటాడు. తరువాత అతనికి సాయుజ్యముక్తి లభిస్తుంది.

----oOo----

## శ్రీబమ్మెర పోతనామాత్యకవి ప్రణీతంబయిన
## శ్రీమదాంధ్రమహాభాగవత పురాణమందలి ధ్రువోపాఖ్యానము
## ధ్రువుడు భగవంతుని స్తుతించుట

సీ. హరి ఈశ్వరుండు విహంగ కులేశ్వర
    యానుఁడై నిజభృత్యుఁడైన ధ్రువునిఁ
గనుఁగొను వేడుక జనియింప నా మధు
    వనమున కప్పుడు పని ధ్రువుడు
పరువడి యోగవిపాక తీవ్రం బైన
    బుద్ధిచే నిజమనోంబురుహ ముకుళ
మందుఁదటి త్ప్రభాయతమూర్తి యటఁ దిరో
    ధానంబునుం బొంది తత్క్షణంబ

తే. తన పురోభాగమునను నిల్చినను బూర్వ
సమధిక జ్ఞాననయన గోచర సమగ్ర
మూర్తిఁ గనుఁగొని సంభ్రమమునను సమ్మ
దాశ్రువులు రాలఁ బులకీకృతాంగుఁడగుచు

తే. నయనముల విభూమూర్తిఁబానంబు సేయు
1పగిదిందన ముఖమునను జుంబనము సేయు
లీలఁ దగ భుజములను నాలింగనంబు
సేయుగతి దండవ న్నమస్కృతులొనర్చె

వ. ఇట్లు దండప్రణామంబు లాచరించి, కృతాంజలియై స్తోత్రంబు సేయ నిశ్చయించియు*(స్తుతి క్రియా సమర్థుండు గాకయున్న) ధ్రువునకు సమస్తభూతంబులకు నంతర్యామియైన ఈశ్వరుండు ధ్రువుని తలంపెఱింగి,

---

1. నిరోధములందు మున్ను నే మెఱుఁగ మనాథనాథ (తం) విరోధ మెఱుఁగ మెందుముం, దిరవుగ దేవదేవ (వా) * ఇంద్రియంబుల చేష్టింప జేయుచు(ట) కొన్ని తా.ప.ప్రతులలో లేదు.

వేదమయంబైన తన శంఖంబుచేత నబ్బాలుని కపోలతలం బంటిన, జీవేశ్వర నిర్ణయజ్ఞుండును, భక్తిభావనిష్ఠుండును నగు ధ్రువుండు లోనే నవతిలైన మదీయ వాక్యంబులం బ్రాణేంద్రియంబులం గరచరణ శ్రవణ త్వగాదులను జిచ్ఛక్తిచేఁ గృపంచేసి జీవింపంజేసిన భగవంతుండవును, పరమ పురుషుండవును నైన నీకు నమస్కరింతు. నీ · వొక్కరుండ వయ్యును మహదాద్యంబైన యీ యశేషవిశ్వంబు మాయాఖ్యంబైన యాత్మీయ శక్తిచేతం గల్పించి యందుంబ్రవేశించి, 1 యింద్రియంబులంచు వసింపుచుఁ *(దత్తద్దేవతా రూపంబులచే) నానా ప్రకారంబుల దారువులం దున్న వహ్నిచందంబునం బ్రకాశింతువు. అదియునుంగాక,

చ. వరమతి నార్తబాంధవ! భవద్ఘన బోధ సమేతుఁడై భవ
చ్చరణము బొందినట్టి విధి సర్గము సుప్తజనుండు బోధమం
దరయఁగఁ జూచురీతిఁ గను నట్టి ముముక్షుశరణ్య మైన నీ
చరణములం గృతజ్ఞుండగు సజ్జనుండెట్లు దలంప కుండెడు?

సీ. మహితాత్మ! మఱి జన్మ మరణ ప్రణాశన
హేతుభూతుండవు సిద్ధ కల్ప
తరువవు నగు నిన్నుఁ దగ నెవ్వరే నేమి
పూని నీ మాయా విమోహి తాత్మ
లగుచు ధర్మార్థ కామాదుల కొఱకఁదా
మర్థింపుచుం ద్రిగుణాథ మైన
దేహోప భోగ్యమై దీపించు సుఖముల
నెరయంగ మది నిచ్ఛయింతు రట్టి

*కొన్ని తా.ప.ప్రతులలో లేదు. 1ఇంద్రియంబుల చేష్టింప జేయుచు.

తే. విషయ సంబంధ జన్యమై వెలయు సుఖము
వారికి నిరయమందును వఱలు దేవ
భూరి సంసారతాప నివార గుణక
థామృతాపూర్ణ! యీశ!+మాధవ! ముకుంద!

మ. అరవిందోదర! తావకీన చరణ ధ్యానానురా గోల్లస
చ్చరితాకర్ణనజాత భూరి సుఖముల్ స్వానందక బ్రహ్మమం
ధరయుఁ లేవఁట దండభృద్భ *త విమానాకీర్ణులై కూలు నా
సురలోకస్థులఁ జెప్పనేల? సుజన స్తోమైక చింతామణీ।

చ. హరి! భజనీయ మార్గ నియతాత్మకులై భవదీయ 1 మూర్తిపై
వరలిన భక్తియుక్తులగు వారల సంగతి గల్గంజేయు స
త్పురుష సుసంగతిన్ వ్యసన దుర్భవసాగర మప్రయత్నతఁ
సరస భవత్కథామృతరసంబున మత్తుఁడ నై తరించెదఁ

చ. నిరతముఁ దావకీన భజనీయ పదాబ్జ 2 సుగంధలబ్ధి యె
వ్వరిమది వొందఁగా గలుగు వారలు దత్ప్రియ వర్త్య దేహము
3 న్నరయఁ దదీయ దార తనయాది సుహృద్గృహ బంధువర్గముఁ
మఱతురు విశ్వతోముఖ! రమాహృదయేశ! ముకుంద! మాధవా!

సీ. పరమాత్మ! మర్త్య సుపర్వ తిర్యఙ్మృగ
దితిజ సరీసృప ద్విజగణాది
సంవ్యాప్తమును సదస ద్విశేషంబును
గైకొని మహదాది కారణంబు

---

* దండభృద్భట(తం.వా) కిన్నృవంతకాపి లిరతా ద్విమానాత్ (మూల) 4–9–10 1. రూపమె (తం.వా) 2. సుగంధలుబ్ధు, లెవ్వరి మదిఁబొందఁగాఁ గలుగు వారలు (తం.వా)సుగంధలబ్ధి నెవ్వరి మది(హ) 3.కరము తదీయధార సుతకామ(హ)4.సమంగళమునైన (తం) + అవ్యయ(ట)

నైన విరాడ్విగ్రహంబు నే నెఱుఁగుదుఁ
గాని తక్కిన 4సుమంగళమునైన
సంతత సుమహితైశ్వర్య రూపంబును
భూది శబ్దాది వ్యాపారశూన్య

తే. మైన బ్రహ్మస్వరూప మే నాత్మ నెఱుఁగం
బ్రవిమలాకార! సంసార భయవిదూర!
పరమమునిగేయ! సంతత భాగధేయ!
నళినేనేత్ర! రమాలలనా కళత్ర!

సీ. సర్వేశ! కల్పాంత సమయంబునందు నీ
యఖిల ప్రపంచంబు నాహిరంచి
యనయంబు శేష సహాయుండ వై శేష
పర్యంకతలమునఁ బవ్వళించి
యోగనిద్రారతి నుండి నాభిసింధు
జ స్వర్ణలోక కంజాతగర్భ
మందుఁజతుర్ముఖు నమరఁ బుట్టింపుచు
రుచి నొప్పు బ్రహ్మస్వరూపి వైన

తే. నీకు మ్రొక్కెద నత్యంతనియమ మొప్ప
భవ్యచారిత్ర! పంక జపత్ర నేత్ర!
చిరశుభాకార! నిత్యలక్ష్మివిహార!
యవ్యయానంద! గోవింద! హరి! ముకుంద!

----oOo----